నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | అక్టోబర్ 12, 2023 | www.navatelangana.com

పొగ మంచుతో కప్పుకుపోయిన సూర్యుడు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో తెల్లవారుజామున పొగమంచి ఏర్పడడంతో ఎదుటి మనిషి కూడా కనిపించడం లేదు. ఉదయిస్తున్న సూర్యుడు సైతం పొగమంచుతో కప్పుకొనిపోయాడా. శీతాకాలం ప్రారంభం కావడంతో తెల్లవారు జామున పొగ మంచు కమ్ముకుంటుండటంతో రోడ్లపై ప్రయాణించే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి లేకుండా పోతోంది. వాహనదారులు నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది.



కమ్ముకున్న మంచు దుప్పటి..

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- ఎస్సై యాదగిరి గౌడ్

నవతెలంగాణ-నవీపేట్

ఎన్నికల నిబంధనలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ యాదగిరి గౌడ్ విలేకరుల సమావేశంలో బుధవారం తెలిపారు. ఎలక్షన్ కోడ్ ఉన్నందున ధర్నాలు, రాస్తారోకోలు, అసాంఘిక కార్యక్రమాలైనా పేకాట, మట్కా ఆడించిన వారిపై రౌడీషీటర్లు ఇలాంటి కేసులలో కల్పించుకున్న కఠిన చర్యలు ఉంటాయని అలాగే రాత్రి 10:30 తర్వాత హెూటల్లు మూసివేయాలని రాత్రిపూట ఎవరైనా అనుమానంగా తిరిగినచో చర్యలు తప్పవని రాత్రి వేళల్లో పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ ముమ్మరంగా తనిఖీలు చేస్తారని అన్నారు.



ఎన్నికల కేక.. ఓటర్లకు కాకా



- ఓటర్లను కాకాపట్టే పనిలో పడ్డ అభ్యర్థులు
- ఆత్మీయ సమ్మేళనాల పేరుతో కుల సంఘాలతో మీటింగ్‌ల జోరు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికల కోడ్ అమలు కాగానే బరిలో నిలబడలనుకునే అభ్యర్థులు ఓటర్ మహాశయుల ప్రసన్నం చేసుకోవడానికి, రకరకాల పేర్లతో కుల సంఘాల నాయకులను, కుల సంఘాల సభ్యులను కాకా పట్టే ప్రయత్నంలోనే మునిగిపోయారు. ఇప్పుడున్న అభ్యర్థి అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగాలని ఆలోచనలో ఉన్న అభ్యర్థులు, నిజామాబాద్ నగరంలో ఎక్కువ సంఖ్యలో ఉన్నటువంటి కుల సంఘాలతో అక్కున చేర్చుకునేందుకు 'ఆత్మీయ సమ్మేళనం' అనే పేరుతో కుల సంఘాల నాయకులకు, సభ్యులకు, ఓటర్లకు దగ్గర కావడానికి అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునే విధంగా వారి కులాలకు ఎటువంటి సమస్యలు ఉన్నాయి..., ఏ సమస్యలతో కుల సంఘాలు ముందుకు వెళ్తాయి..., ఇంకా ఆ కుల సంఘాలకు కావలసిన భవనాలు..., వంట పాత్రలు, ఇతర సామాగ్రి కొని ఇవ్వడానికి అయినాను మేము సిద్ధం అంటూ, మీ అండదండలు మాకు కూడా ఉండాలి..., మీరు ఆశీర్వదిస్తేనే మేము పోటీలు నెగ్గుకోగలుగుతామని కుల సంఘాల వారికి తెలియజేస్తున్నారు.

ఒక ప్రధాన పార్టీకి చెందిన అసెంబ్లీ ఎన్నికల్లో నిలబడే అభ్యర్థి ఏసి హెూటల్లో ఆత్మీయ సమ్మేళనం ఉదయం ఏర్పాటు చేస్తే, మరో ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థి, ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఏసీ ఫంక్షన్ హాల్ లో సాయంత్రం వేళ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వచ్చిన కుల సంఘాల నాయకులకు, సభ్యులకు, ముఖ్యంగా వారికి ఇష్టమైన విధంగా చికెన్, మటన్, బిర్యానీ వంటి ఆహార పదార్థాలను వారికి తినిపించి ఇప్పటినుండే అభ్యర్థులు కాకాపడుతూ జరిగే ఎన్నికల్లో ఓట్లు రాబట్టే ప్రయత్నంలో మునిగిపోతున్నారు.

అభ్యర్థులు ఏ కుల సంఘం వారైతే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారో, ఆ అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కొన్ని తర్వల వారీగా ఏర్పాటుచేసి కొందరు కొందరు సభ్యులను, కొన్ని కొన్ని తర్వల సంఘాల సభ్యులను కొన్ని కొన్ని ప్రైవేటు ఫంక్షన్ హాల్ లలో సుమారు 1000 నుంచి 1200 మంది సభ్యులకు కలిపి ఏర్పాటు చేసి అందరికీ ఓటు వేయాలనే కుతూహల సమాచారం సభ్యులకు చేరే విధంగా ఈ ఆత్మీయ సమ్మేళన సమావేశాలు ఏర్పాటు చేయడానికి ముందుకు వెళ్తున్నారు. కానీ ఈ ఓటర్ మహాశయులు ఓట్లు వేసి గెలిపించేంతవరకు ఏ కుల సంఘపు ఆత్మీయ సమ్మేళనం విజయవంతమైందో ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే తెలుస్తుంది. ఏ అభ్యర్థి వేసిన స్కెచ్ విజయవంతమైందో అప్పుడే బయటపడుతుంది.

నిజామాబాద్ సీపీ బదిలీ

- బాధ్యతలు స్వీకరంచిన నెల 10 రోజుల్లోనే బదిలీ చేసిన ఎన్నికల సంఘం



నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ సీపీ సత్యనారాయణపై బదిలీ వేటు పడింది. గత నెల 2వ తేదీనా బాధ్యతలు స్వీకరించగా.. నెల పది రోజులు గడవకముందే బదిలీ చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రెండుమూడు రోజుల్లో కొత్త సీపీ రానున్నట్టు సమాచారం. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పలు అధికారుల తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందడంతో పలువురు కలెక్టర్‌లను, సీపీలను బదిలీ చేశారు. దీంట్లో భాగంగా నిజామాబాద్ సీపీని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన వెంటనే బందోబస్తు చర్యల్లో సీపీ చురుగ్గా వ్యవహరించారు. అటు వినాయక చవితి, ఇటు మిలాద్ ఉన్ నబి పండుగలు ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా చర్యలు చేపట్టి ప్రజలతో శెభాష్ అనిపించుకున్నారు. ఇంతలోనే బదిలీపై వెళ్లనుండటం పట్ల జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అధికారుల బదిలీలకు కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బదిలీ చేపట్టడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

వాహనాల తనిఖీలలో రూ 50 లక్షలు సీజ్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున, బుధవారం నిజామాబాద్ అసిస్టెంటు కమీషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ ఆద్వర్యంలో ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ ఎస్సై మహేష్, సి.ఐ కృష్ణ సిబ్బంది వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇందల్ వాయి వద్ద అనుమానస్పదంగా ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 50లక్షల రూపాయలను స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా 50వేలకు ఎక్కువ డబ్బులు తీసుకుని వెళ్తే పట్టుకొని డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందని దీనికోసం ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

చెక్‌పోస్టులో తనిఖీలు

- 2.40 లక్షల నగదు పట్టివేత



వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు

నవతెలంగాణ-మద్నూర్

అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తెలంగాణ రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్ర బార్డర్‌లో మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ గ్రామ సమీపంలో చెక్‌పోస్టు వద్ద అధికారులు వాహనాలను తనిఖీ చేపట్టారు. బుధవారం మహారాష్ట్ర నుండి తెలంగాణలోకి వచ్చే కారులో రెండు లక్షల నలభై వేల రూపాయలు నగదు డబ్బులకు ఎలాంటి రసీదులు లేకపోవడంతో ఆ డబ్బుని తనిఖీ చెక్పోస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ డబ్బులకు సంబంధించిన వివరాలు ఐటి అధికారులకు అప్పజెప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ నాజీమ్ ఆర్ఐ శంకర్ ఎస్సై కృష్ణారెడ్డి ఐటి అధికారులు ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖ రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పేలిన సాల్వెంట్ డ్రమ్

- అర్ధరాత్రి కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు
- ఇద్దరికి తీవ్ర కూలీలకు గాయాలు
- పరిస్థితి విషమం హైదరాబాద్ తరలింపు

నవతెలంగాణ-భిక్కనూర్



ప్రమాదవశాత్తు కెమికల్ ఫ్యాక్టరీలో సాల్వెంట్ డ్రమ్ పేలడంతో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న విజయసాయి కెమికల్ ల్యాబ్ లో అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం అర్ధరాత్రి విజయసాయి కెమికల్ ల్యాబ్ లో సాల్వెంట్ డ్రమ్ కెమికల్ ప్రమాదవశాత్తు ఒక్కసారిగా పేలింది. దీంతో ఇద్దరు కార్మికులు ఉత్తర ప్రదేశ్ ప్రాంతానికి చెందిన జగదీష్, పశ్చిమ బెంగాల్ కు చెందిన బబ్లుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కంపెనీ యాజమాన్యం చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

వతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివనగర్ మండలం ఉత్నూర్ గ్రామానికి చెందిన యువకులు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డేపల్లి సుబాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భారీగా చేరారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుకు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. ఈసందర్భంగా సుబాష్‌రెడ్డి వారికి కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రైతు భరోసా ద్వారా రైతులకు 2 లక్షల ఋణ మాఫీ చేస్తామని తెలిపారు. బి.ఆర్. యస్ పార్టీ కి చరమగీతం పాడలని తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రకటించిన కాంగ్రెస్ గ్యారంటి కార్డు ప్రజలకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివపాటిల్,నాయకులు జైపాల్‌రెడ్డి, నవీన్, సర్పంచ్‌లు బాల్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ అధ్యక్షులు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్దికుంటలో బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

నవతెలంగాణ-రామారెడ్డి



మండలం లోని మద్దికుంటలో బెల్ట్‌షాప్‌పై పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన బస్వాపురం గంగరాజ గౌడ్ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా, అధిక ధరలకు మధ్య అనే విక్రయిస్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు, ఇంట్లో తనిఖీలు నిర్వహించగా రూ, 7900 విలువ గల 18 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

అర్హులకు అందని ఓటర్‌కార్డులు

- జాడే లేని పాత ఓటర్ కార్డులకు కొత్త నెంబర్లు
- ఎన్నికలవేళ ఓటు వినియోగానికి ఇక్కట్లు తప్పేలా లేవ్
- ఆన్‌లైన్‌లో వెతికినా డౌన్‌లోడ్ కాని వైనం
- పోస్టులో వస్తాయంటున్న అధికారులు



నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నగారా నవంబర్ నెల 30వ తేదీ నాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న యువతి, యువకులు, పాత ఓటర్ కార్డులకు కొత్త నెంబర్ జారీ చేసిన వారికి నూతన ఓటర్ కార్డులు రాకపోవడంతో ఎన్నికల సమయం ఓటర్ కార్డు లేక ఏ విధంగా ఓటు వేయాలో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లాలో 6,61,163 ఓటర్లు ఉన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికలలో ఉపయోగపడే ఓటర్ కార్డులు అందుబాటులో లేకపోవడంతో తమ ఓటర్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాలలో డౌన్‌లోడ్ కాకపోవడం, ఓటర్ కార్డు నెంబర్ కూడా లేకపోవడంతో ఓటర్ కార్డు ఎలా తీసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా అధికారులు వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని తెలియజేసిన వెబ్‌సైట్‌లలో ఓటర్ కార్డు డౌన్‌లోడ్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఓటర్ కార్డులు ఫోస్ట్ ద్వారా ప్రతి ఒక్కరికి అందుతాయని, సమయానికి ఓటరు కార్డు లెకున్నా ఆధార్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డు ద్వారా ఓటు వేయచ్చుని, ప్రతి గ్రామపంచాయతిలో ఓటరు కార్డు సంబంధించిన తుది జాబితా పంపించడం జరుగుతుందని గ్రామపంచాయతీలలో ఓటరుకార్డు లిస్ట్‌లలో తమ పేర్లు ఉన్నాయెూ లెవో చూసుకొని లేని వారు ఈ నెల చివరి వరకు ధరఖాస్తు చేసుకోవచ్చుని జిల్లా అధికారులు తెలియజేస్తున్నారు.

బాన్సువాడకు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో..?

- కార్యకర్తల ఎదురుచూపులు

నవతెలంగాణ-వర్ని



రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అయితే బాన్సువాడలో కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో బాన్సువాడ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అధిష్టానం ఖరారు చేయకపోవడంతో కార్యకర్తలు కలవరం చెందుతున్నట్లు సమాచారం. నెలలోనే పూర్తిస్థాయిలో ఎన్నికలు ఉండడంతో ఇప్పటికీ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించక కార్యకర్తలు మౌనం వహిస్తున్నారు. అధిష్టానం ఆలస్యం చేయడంతో టికెట్ ఎవరికీ ఇస్తారని సామలోచనలో పడ్డారు.

నియోజకవర్గం నుంచి 16 మంది దరఖాస్తు

కాంగ్రెస్ పార్టీ నుంచి బాన్సువాడ టికెట్ కొరకు ఇప్పటికే 16 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అయినా వారి నుంచి ఒకరిని కూడా అధిష్టానం ఇప్పటివరకు ఖరారు చేయలేదు. ఈ మధ్య కాలంలో ఒక్క నియోజకవర్గంలో నుంచి ఒక వ్యక్తిని ప్రకటించినట్టు పేపర్లో సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో స్థానిక కార్యకర్తలు నిరాశలు చెందుతున్నట్లు తెలుస్తుంది. కాసుల బాలరాజుకు టికెట్ ఇవ్వకుండా దరఖాస్తు చేసుకున్న 16 మందిలో ఎవరికి ఇచ్చిన మద్దతు ఇచ్చి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని ఢిల్లీ అధిష్టానం వద్ద 16 మంది అభ్యర్థులు అక్కడనే కలుస్తూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ పక్క నియోజకవర్గం ఎల్లారెడ్డి నుంచి సుభాష్ రెడ్డికి టికెట్ వేస్తున్నట్లు ప్రచారాలు కొనసాగుతున్నాయి. దీనితో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు నిరాశకు గురవుతున్నట్లు వినికిడి.

ఆశావహులకు నిరాశేనా..?

నియోజకవర్గం నుంచి నాకంటూ నాకు టికెట్ కావాలని దరఖాస్తు చేసుకున్న 16 మంది అభ్యర్థులకు అధిష్టానం ఇప్పటివరకు కూడా సరైన సమాచారం వారికి ఇవ్వకపోవడంతో వారికి టికెట్టు ఇస్తుందా లేదా అని ఆలోచనలో కార్యకర్తలు సతమతం అవుతున్నారు. అధిష్టానం 16 మందిలో తమకు ఎవరికైనా ఒకరికి ఇవ్వాలని మొండికేసి ఉన్నప్పటికీపై స్థాయి అధిష్టానం ఆదేశాలు మాత్రం వారిని నిరాశకు గురి చేస్తున్నట్లు ఉందని కార్యకర్తల నుంచి ఆవేదనలు వినబడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి మంచి అభ్యర్థిని అర్హత కలిగిన అభ్యర్థిని ఎంపిక చేసిటికెట్ ప్రకటిస్తే స్థానిక ప్రజలకు కార్యకర్తలకు దీమా ఉంటుందని వినికిడి.

విసిగిపోతున్న కార్యకర్తలు

అభ్యర్థిని ఎప్పుడు ప్రకటిస్తారా అంటూ నియోజకవర్గ కార్యకర్తలు ఎదురు చూసి అలసిపోతున్నారు. చివరికి తమ నిర్ణయాలు మార్చుకునే పరిస్థితులు కూడా ఉన్నాయని సమాచారాలు వినిపిస్తున్నాయి. స్థానిక స్పీకర్ పోచారం ఢీ కొనాలంటే ముందస్తుగా అభ్యర్థిని ప్రకటించాలని ఆలోచనలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర అధిష్టానం వెంటనే బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేస్తే గెలుపు ఖాయమని ధీమా కూడా వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్ హయాంలో పెరిగిన మత్స్య సంపద

- ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ హయాంలో మత్స్యకారుల అభివృద్ధికి పెద్దపీట వేసినట్టు అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్త తెలిపారు. 2 కోట్ల రూ. లతో ఆధునిక సదుపాయలతో చేపల మార్కెట్ నిర్మాణం చేపట్టామని, వినాయక్ నగర్ గంగ పుత్ర సంఘం కమ్యూనిటీ హల్ కోసం 5 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని జనార్ధన్ గార్డెన్స్ లో గంగ పుత్ర ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. నిజామాబాద్ నగరంలో పోటా పోటీగా అభివృద్ధి - సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యం అని అన్నారు.

'కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిషన్ కాకతీయ ద్వారా చెరువులు నిండు కుండల మారాయి. సాగు నీటి ప్రాజెక్టులు, చెరువులు మత్సకారులకు వరంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు సబ్సిడీపై వాహనాలు పంపిణీ చేస్తుంది. రాష్ట్రంలో 13 లక్షల మంది మత్సకారులు కుల వృత్తి పై ఉపాధి పొందుతు న్నారు. నిజామాబాద్ నగరంలో చేపల మార్కెట్ నిర్మాణం లో ఉంది. నిజామాబాద్ నగరం లో చేపల మార్కెట్ అందుబాటులోకి వస్తే మత్స్యకారులకు ఉపాధి లభించడంతో పాటుగా నగర ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. అహ్మది బజారులో మార్కెట్ లో చేపల విక్రయ కేంద్రం ఏర్పాటు చేసి గంగ పుత్రులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించాము.నిజామాబాద్ నగరం లో పోటా పోటీగా అభివృద్ధి -సంక్షేమ పథకాలు అమలవుతున్నా'యని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్ ,నూడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,దండు శేఖర్,సిర్ప రాజు,గంగ పుత్ర సంఘం నాయకులు పల్లికొండా అన్నయ్య, మాకు రవి, జూంబరతి గంగామణి,కార్పొరేటర్ లు వెల్డింగ్ నారాయణ, సాయి వర్ధన్, నాయకులు ఎర్రం గంగాధర్, రంగు సీతారామ్, పుప్పాల బాజన్న, ముత్యాలు,మధు సుధన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మత్స్యసంఘం నాయకులు

న్యాయ చైతన్య సదస్సు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ కామారెడ్డిలో న్యాయ చైతన్య సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బాలిక విద్యార్థినుల చేత బాల్య వివాహాలని అరికడతాము అని ప్రతిజ్ఞ చేయించారు .ఈ కార్యక్రమానికి విచ్చేసిన చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఆర్.బి రమేష్ చంద్ డిప్యూటీ లీగల్ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.మోహన్ రావు అసిస్టెంట్ లీగల్ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పల్లె చిరంజీవి మాట్లాడుతూ బాలికల హక్కులు, భద్రతపై సూచనలు చేవారు. ఈ కార్యక్రమం జిల్లాన్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్‌కు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి బదిలీపై వెళ్లడంతో బుధవారం ప్రిన్సిపల్ నరేందర్ ఆధ్వర్యంలో శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. లింగంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఐదున్నర సంవత్సరాలుగా విధులు నిర్వహించి బిచ్కుందకు బదిలీపై వెళ్లిన సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన కళాశాలకు చేసిన సేవలు వేదిక నిర్మాణం సరస్వతీ విద్యా ప్రతిష్టాపనతో పాటు ఉత్తీర్ణతలోనూ 95 శాతం రిజర్వేషన్ సాధించి విద్యాభివృద్ధికి కృషి చేశారని విద్యార్థులు ఆయనను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్ లెక్చరర్లు దుర్గయ్య రాజయ్య శివ శ్రీకాంత్ దర్శింగ్ నాగు స్వామి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-బిచ్కుంద



బతుకమ్మ ఉత్సవాల్లో విద్యార్థినులు

రాష్ట్ర విద్యాశాఖ, సాంస్కృతిక శాఖ ఆదేశానుసారం బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగు పూలతో బతుకమ్మలు తయారుచేసి బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ మాట్లాడుతూ పూలను పూజించే గొప్ప తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కనుమరుకు కాకుండా ముందు తరాలకు తెలిపే విధంగా వేడుకలను జరుపుకోవాలని విద్యార్థులు విద్యతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల చదువుతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందించుకోవడానికి దోహద పడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం విద్యార్థినులు ఉన్నారు.

బీజేపీలో రగడ

బాన్సువాడ టికెట్ మల్యాద్రికి ఇవ్వొద్దంటూ నాయకుల వాగ్వాదం

నవతెలంగాణ-వర్ని

ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు బహిర్గతమవుతున్నాయి. తాజాగా బాన్సువాడలో టికెట్ మల్యాద్రిరెడ్డికి ఇవ్వొద్దంటు పలువురు కార్యకర్తలు బహిరంగంగా డిమాండ్ చేస్తున్నారు. బుధవారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించుకున్నారు.

బాన్సువాడ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు పలువురు దరఖాస్తులు చేశారు. అయితే చేసిన వారిలో కొంత మంది సమావేశమై మల్యాద్రికి టికెట్ కేటాయించొద్దని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి.. పార్టీ కోసం ఎలాంటి కృషి చేయలేదని వారు పేర్కొనడం గమనార్హం. టికెట్ కేటాయింపులు జరిగేలోగా ఇంకా ఎన్ని విబేధాలు బయటక వస్తాయో వేచి చూడాలి.

పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన తమిళనాడు పసుపు రైతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



పరిశీలిస్తున్న రైతులు

మండల కేంద్రంలోని ఆచార్య కొండ లక్ష్మణ బాపూజీ పసుపు పరిశోధన కేంద్రాన్ని తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్ ప్రాంత పసుపు రైతులు బుధవారం సందర్శించి పరిశీలించారు. పసుపు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్ పసుపు సాగులో ఆధునిక పద్ధతుల గురించి తమిళనాడు పసుపు రైతులకు వివరించారు. శాస్త్రవేత్త శ్రీనివాస్ పసుపు కోత తర్వాత యాజమాన్య పద్ధతులను వివరించారు. కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలను, పసుపు సాగులో పాటించాల్సిన మెలకువలను రైతులు శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డ్ సూపరింటెండెంట్ రామాణిక్యం, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు టీడీపీ రిలే నిరాహారదీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం 15వ రోజుకు చేరుకుంది. ఎలక్షన్ కోడ్ రావడం వల్ల ధర్నాచౌక్‌లో పర్మిషన్ ఇవ్వకపోవడంతో 15వ రోజు పార్టీ కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించామని నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్, ప్రతాప్‌రెడ్డి, కొయేడి నర్సింలు, బొబ్బ నరసింహ, షేక్ ఫిరోజ్, శంకర్ ముదిరాజ్, అశోక్, నాగేశ్వరరావు, నర్సయ్య, రాజేశ్వర్ గుప్త, రవికుమార్ పాటిల్, లక్ష్మి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిజామాబాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మున్నూరు కాపు సంఘం దుబ్బాసబ్ స్టేషన్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ కే.ఈశ్వరయ్య అధ్యక్షతన లోకల్ కోర్టు నిర్వహించారు. మెంబర్ టెక్నికల్ ఎస్.రామకృష్ణా, ఫోర్త్ మెంబర్ రాజాగౌడ్, సిజీఆర్‌ఎఫ్ ఏడీఈ జీ.కృష్ణా, నిజామాబాద్ ఆపరేటర్ డిఈయం శ్రీనివాస్, నిజామాబాద్ ఆపరేటర్ ఏడీఈ టౌన్ 2 తోట రాజశేఖర్ సమన్వయంతో నిర్వహించారు. ఏడిఈలు చంద్రశేఖర్, టౌన్ 2 ఏఏఓ వీరేశం, గంగారాం నాయక్, ఏఈలు డి.శ్రీనివాస్, ఆర్.సుమిత, గంగాశేఖర్, రాంసింగ్, సబ్ ఇంజనీర్స్ ప్రణయ్, మాలతీ, నాజ్‌మా, అజారుద్దీన్, ఎఫ్‌ఎంజీఆర్ సోమ్లు, లక్ష్మణ్, రాజయ్య, నిజాముద్దీన్ పాల్గొన్నారు.



సమస్యపై వినతి

బోధన్ పట్టణ ప్రాంతానికి చెందిన వృద్ధురాలి నేత్రదానం

నవతెలంగాణ-బోధన్‌టౌన్



బోధన్ పట్టణానికి చెందిన వృద్ధురాలు పంతుల ఆగమ్మ తన నేత్రాలను దానం చేశారు. ఆమె మంగళవారం మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను బోధన్ లయన్స్ క్లబ్‌కు దానం చేశారు. మృతురాలు ఆగమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి పెద్ద కుమారుడు డాక్టర్ రఘుపతి గౌడ్ హైదరాబాద్ ఆయుర్వేదిక్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె నేత్రదానం ఎంతో ఆదర్శప్రాయమని ప్రముఖులు పేర్కొన్నారు.

విద్యార్థినులకు హైజిన్ కిట్స్ అందజేత



విద్యార్థులకు హైజిన్ కిట్స్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో నిజామాబాద్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హైజిన్ కిట్స్‌ను అందజేసినట్టు రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి హరిత రవీందర్ స్పష్టం చేశారు. పాఠశాలలో చదువుకునే నిరుపేద విద్యార్థుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హైజిన్ కిట్స్‌ను అందజేసినట్టు వివరించారు. ఈ సందర్భంగా రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు, ఉదయం భోజనంకు ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ఆయన సూచించారు. నిరుపేద విద్యార్థినులకు సొసైటీ ద్వారా హైజిన్ కిట్స్‌ను అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ బోధన్ డివిజన్ ఉపాధ్యక్షుల అశ్వక్ హైమద్, హెచ్‌ఈఓ శ్రావణ్ కుమార్, హాస్టల్ వార్డెన్ రాధా రాణి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ పేకాటాడితే మూడు లక్షల జరిమానా..

- 6 నెలల జైలు శిక్ష విధిస్తాం : తహసీల్దార్ కలీం



పేకాట రాయుళ్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖలీం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మళ్లీ పేకాట ఆడితే మూడు లక్షల జరిమానా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తామని తహసీల్దార్ ఎంఏ కలీం అన్నారు. బుధవారం మండలంలోని తొర్లికొండ గ్రామ శివారులో జక్రాన్‌పల్లి పోలీసులు పేకాటాడుతున్న వారిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

అధికారులు సమన్వయం పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

ఎన్నికల అధికారులు సమన్వయం పాటించాలని ఉన్నతాధికారులు సూచించారు. రాబోయే ఎన్నికలలో ఎన్నికల నియమ నిబంధనలపై తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో గౌస్ ఉద్దీన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి గ్రామ కార్యదర్శులకు, అంగన్వాడీ టీచర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామ కార్యదర్శులు సంబంధిత అధికారులకు తెలియపరచి వారి సలహాలు పాటించాలన్నారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, ఎలక్షన్ల సమయంలో ఎన్నికల అధికారులు సమన్వయం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్, శ్రీకాంత్, సునీల్, మహబూబ్ అలీ, సిహెచ్ సాయి, ఆమ్రిన్, రోజా, శివ కృష్ణ, సుమన్, రాజు, బి రాణి, నవీన్, రజిత, గౌతమి, రాజు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

- మామిడిపల్లి పాఠశాలలో ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థినులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలికలకు పోషకాహారం, మంచి అలవాట్లు చిన్ననాటి నుండే అలవర్చుకోవాలని, బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించి, బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏసిడిపిఓ జ్యోతి, అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, అంగన్వాడి టీచర్లు జగదాంబ, సంగీత, శైలజ, గోదావరి, లక్ష్మి, మహిళ శక్తి యువజన కౌన్సిలర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వాహనాల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-బోధన్

శాసనసభ ఎన్నికల సందర్భంగా మోడల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంతరాష్ట్ర తనిఖీ కేంద్రాల వద్ద వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు, ఇతర శాఖల సిబ్బందికి సూచించారు. బుధవారం సాలూర మండల అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మోడల్ కండక్ట్ కోడ్ పక్కాగా అమలు చేయాలని, అందులో భాగంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఎవరైనా వారి అవసరాల కోసం సామాన్య ప్రజలు డబ్బులు తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని వాటిని చూపించిన తక్షణమే వదిలేస్తారని అన్నారు. పోలీస్ ఎక్సైజ్ శాఖ, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు చెక్ పోస్ట్ వద్ద అప్రమతగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 4 సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సాలురా-బిలోలీ మధ్యలో చెక్‌పోస్ట్, కండ్‌గాం-కొండలవాడి మధ్య, కందకుర్తి-ధర్మాబాద్ మధ్య, పోతంగల్-దెగ్లూరు మధ్య సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర చెక్ పోస్టులు నాలుగు ఏర్పాటు చేసి పకడ్బందీగా వాహనాలు తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మహారాష్ట్ర సరిహద్దు నుండి లిక్కర్, దేశీదారు తెలంగాణలోకి రాకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు విశాఖ, మల్కాపూర్ నుండి నాందేడ్ ప్రాంతంలో నిల్వచేసినట్లు తమకు సమాచారం వచ్చిందని, ఆ మత్తు పదార్థాలు తెలంగాణ ప్రాంతంలో రాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నకిలీ ఓటర్లు తెలంగాణలో వచ్చిన, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారి వెంట ఆర్డిఓ రాజాగౌడ్, ఎక్సైజ్ సిఐ రాణి, రూరల్ సిఐ శ్రీనివాస్‌రాజ్, బోధన్ పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, సాలుర తహసిల్దార్ మల్లయ్య, తదితర శాఖల అధికారులు ఉన్నారు.



సాలురా చెక్ పోస్ట్ తనిఖీ చేస్తున్న కలెక్టర్, పోలీస్ కమిషనర్

నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

- సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో భూపోరాటం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బోర్గాం (పి) శివారు ప్రభుత్వ భూముల్లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో భూ ఆక్రమణ చేసి, ముళ్లపొదలను చదునుచేసి ఎర్రజెండాలు పాతారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలోని 5వ డివిజన్ బోర్గాం, ఆర్యనగర్, మహాలక్ష్మి నగర్, వినాయక్ నగర్ కాలనీవాసులు వందలాదిమంది నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం ఏళ్లుగా పాలకులకు విన్నవిస్తున్నార అని అన్నారు. చాలీచాలని వేతనాలతో కూలీ పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ అవస్థలు పడుతున్నారన్నారు. ఇళ్ల స్థలాల కోసం గత ఐదారు సంవత్సరాలుగా రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుండి గానీ, అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడం దుర్మార్గమన్నారు. ఈ నేపథ్యంలో మరో మార్గం లేక, పేదలే ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే కొంతమేర కబ్జా చేశారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలను నివారించి, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి సాయగౌడ్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, నగర నాయకులు ముత్యాల నారాయణ, లక్ష్మి, మోపాల్ మండల కార్యదర్శి గంగమల్లు, పీ.డీ.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, నగర అధ్యక్షులు ఎస్కే అషర్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా అరుణోదయ నాయకులు గంగారం, స్థానిక నాయకులు రాజేష్, సుమలత, అమూల్య, అక్బర్, లలిత, పద్మ, లక్ష్మీ, నర్సింలు, గంగాధర్, సంతోష్, 260 మంది నిరుపేదలు పాల్గొన్నారు.



భూ పోరాటంలో పాల్గొన్న పేదలు, నాయకులు

బహుజన రాజ్యాధికారమే బీఎల్ఎఫ్ లక్ష్యం

- బీఎల్ఎఫ్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి సబ్బని లత

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా ఏర్పడిన బీఎల్ఎఫ్ 93శాతం ఉన్న బహుజన ప్రజలకు రాజ్యాధికారం కోసం ఓటు చైతన్యం ద్వారా బహుజన ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తామని బీఎల్ఎఫ్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి సబ్బని లత చెప్పారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో మెజారిటీ బహుజన ప్రజల సంక్షేమం కోసం అసెంబ్లీ ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ప్రజల కోసం మరింత సేవ చేస్తానని చెప్పారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీడీ కార్మికులకు జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చి కేసీఆర్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం కోసం పోరాడుతున్న బిఎల్ఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్‌లు బహుజన ప్రజలను ముఖ్యంగా బిసి కులాల ప్రజలను విస్మరించారని ఆ పార్టీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి జిల్లా కన్వీనర్ కె.మధు, బహుజన మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.గీతాంజలి, జిల్లా ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, బి.జగదీష్, నగర నాయకులు గంగాధర్ గాయక్వాడ్, కుమార్, టి.రాజు, గాదెపాక గోపి, రాజు, సహదేవ్, సాయి కాంబ్లే, జీజా బాయి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బిఎల్ఎఫ్ నాయకులు

వైశ్య కార్పొరేషన్ తీసుకురాని అసమర్థుడు

- ఎమ్మెల్యే బిగాలపై మండిపడ్డ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వైశ్య కార్పొరేషన్ తీసుకురాని అసమర్థుడు ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. నిఖిల్‌సాయి హోటల్‌లో బుధవారం ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సోదరుల్లో ప్రతి కష్టంలో భాగస్వామ్యమయ్యానని తెలిపారు. నగరంలోని అనేక సంఘాలకు తన ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు అందించానని అన్నారు. కుల సంఘాల్లో ఎప్పుడు రాజకీయాలు మాట్లాడలేదని అన్నారు. ఎవరో మాట్లాడితే పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయంగానే ఎదుర్కొంటానని, తాను ఎవరిపైనా వ్యక్తిగతంగా దూషించలేదని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే 7 సంవత్సరాల నుంచి పాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలంటే ఇప్పటివరకు స్పందించలేదని, అర్బన్‌లో వందల కోట్ల అభివృద్ధి అని చెప్పుకునే ఎమ్మెల్యే, తను ఇంటిముందు క్యాంప్ ఆఫీస్లు రోడ్లు వేయగానే నిజామాబాద్ అభివృద్ధి అనుకుంటారా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కల్వకుంట్ల దోపిడి నిజామాబాద్‌లో, భూ కబ్జాలు అంతు లేని అవినీతి బయటపెడతామని వివరించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వైశ్యులందరూ 9 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా కెసిఆర్ ప్రభుత్వం ఆర్యవైశ్యులను గుర్తించలేదని అన్నారు. ఆర్యవైశ్యులకోరకు ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆర్యవైశ్య కార్పొరేషన్ కోసం ఏమాత్రం సహకరించలేదని తెలిపారు. తాను ఆర్యవైశ్య సోదరులకు అండగా ఉంటామని, రాబోయే రోజుల్లో మీరందరూ మద్దతు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓసీలకు ఈడబ్ల్యూఎస్ ద్వారా ఎంతో మేలు చేసిందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముద్ర లోన్ ఇప్పుడు నగరంలో మన వైశ్య సోదరులు చాలామంది లబ్ది పొందారని వివరించారు. ఆర్యవైశ్య పుర ప్రముఖులు మూడ నాగభూషణం గుప్తా, మాజీ అధ్యక్షులు ఉప్పలంచ భూమలింగం, యువ జన సంఘం అధ్యక్షులు ఇల్లెందుల ప్రభాకర్, వాసవి కన్యకా పరమేశ్వరి అధ్యక్షులు పెండ్యాల వాసు, పాల్దే లక్ష్మీకాంతం, లాబీ శెట్టి శ్రీనివాస్, జిల్లా మహాసభ అధ్యక్షులు మోటూరి మురళి, డాక్టర్ వెంకటరమణ, చిట్టిమిల్ల హరిప్రసాద్, అరవపల్లి పురుషోత్తం, నంగులూరి పోచయ్య, బేజుగం అశోక్, కార్పొరేటర్ మమత, ధన్‌పాల్ శ్రీనివాస్, చందూరు ధర్మేందర్, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, బచ్చు పురుషోత్తం, కొండా సత్యప్రసాద్, పెద్ది సాయిబాబా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దన్‌పాల్ సూర్యనారాయణ

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె నిరవధిక సమ్మె నిర్వహించడం, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ మేరకు, యూనియన్ రాష్ట్ర విస్తృత సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అక్టోబర్ 11 నుండి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్, అధ్యక్షురాలు చామంతి లక్ష్మి తెలియజేశారు. ఈ మేరకు సమ్మె వాయిదా నోటీసును జిల్లా విద్యాశాఖ ఏడికి బుధవారం అందజేశారు. త్వరలోనే పెండింగ్లో ఉన్న బిల్లులు, 3000 రూపాయల గౌరవ వేతనాన్ని చెల్లించడానికి కలిగే ఇబ్బందులను అధిగమించడానికి రాష్ట్ర కమిషనరేట్ స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించారని అన్నారు. మిగిలిన డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



సమ్మె వాయిదా నోటీసు అందజేత

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్‌ను కలిసిన మాజీ మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కె.మురళీధరన్‌ని నిజామాబాద్ తొలి మేయర్, కాంగ్రెస్ నాయకులు ధర్మపురి సంజయ్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు.



ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో అధ్యాపకులకు సన్మానం



అధ్యాపకులను సన్మానిస్తున్న నాయకులు, విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలోని అధ్యాపకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికైన ప్రొఫెసర్ ఎం.యాదగిరి (రిజిస్ట్రార్), కలల శాస్త్ర పీఠాధిపతి నూతన బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ త్రివేణి, అర్థశాస్త్ర విభాగ అధిపతిగా నూతన బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎ.పున్నయ్యకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటీ అధ్యక్షులు కే. శ్రీశైలం మాట్లాడుతూ యూనివర్సిటీ అభివద్ధికి మరింత కషి చేయాలని, మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దత్త హరి, స్వప్న, నవ్య, ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు అభినయ్, కార్యదర్శి రాజేందర్, అనిల్‌కుమార్, విజయకుమార్, రాజ్‌కుమార్, విద్యార్థులు అనిల్ నంద, రమేష్, సంధ్య, సరోజ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

సారే కావాలి.. కారే రావాలి

- దివ్యాంగుడి జన చైతన్య యాత్ర
- అభినందించిన మంత్రి వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సారే కావాలి.. కారే రావాలి అంటూ మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి లింగాపూర్ తండాకు చెందిన దివ్యాంగుడు డి.మహేష్ కేసిఆర్ సర్కార్‌కు మద్దతుగా మోటార్ సైకిల్ పై రాష్ట్ర వ్యాప్తంగా జన చైతన్య యాత్ర చేపట్టాడు. అందులో భాగంగా బుధవారం వేల్పూర్ చేరుకున్న మహేష్ రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసిఆర్‌కి మద్దతుగా ప్రజలను చైతన్య పరిచేందుకు మహేష్ తన వంతుగా చేస్తున్న యాత్ర గురించి తెలుసుకున్న మంత్రి ఆయన్ను అభినందించారు. కేసిఆర్ ది మానవీయ పాలన అని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు రూ.4016 ఆసరా పెన్షన్ ఇస్తూ వారి జీవితానికి భరోసా కల్పించిన ఏకైక ప్రభుత్వం కేసిఆర్ దే అన్నారు. కేసిఆర్ చేసిన మంచిని, ఆయన పాలనలో ప్రగతిని సోదరుడు మహేష్ కర పత్రాలు పంచుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేసిఆర్‌కి మద్దతు కూడగట్టేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
గురువారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చెట్కూరి రాజేశ్వర్ రెడ్డి, అధ్యక్షులుగా మొసర్ల రాములు, ఉపాధ్యక్షులుగా ఆకులింగం, టి.కృష్ణ మూర్తి , యల్. మోహన్ రెడ్డి, శేకెల్లి రాజు ,కాలమొల్ల శంకర్, ప్రదాన కార్యదర్శి ఆకుల కృష్ణ, కార్య దర్శులు బునగారి రాములు ,ఎర్ర నర్సారెడ్డి, ఆస లక్ష్మణ్ ,ఆస రవి.కోశాధికారులు సంకరి శ్రీనివాస్, ఆస శంకర్ తదితరులను ఎన్నుకున్నారు.

శ్రీ కాలభైరవ స్వామి హుండీ లెక్కింపు



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి-రామారెడ్డి లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారి హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. 60 రోజుల్లో స్వామివారికి కానుకగా రూ.3,01,910 వచ్చినట్లు ఆలయ ఈవో బి ప్రభు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్, భాస్కర్ రెడ్డి, ఇస్సాయిపేట బైరయ్య, బాలమల్లు, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు నాపై చూపే ప్రేమను దూరం చేయలేరు


మంత్రిని కలిసిన పలువురు

- అన్ని వర్గాల ప్రజల నుండి సంపూర్ణ మద్దతు
- ప్రజలు, రైతుల్లో మంత్రి చేసిన అభివృద్ధి పనులకు విశేష స్పందన
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఓట్ల కోసం ఎవరెన్ని రకాల కుయుక్తులు పన్నినా.. బాల్కొండ నియోజకవర్గ ప్రజలు నాపై చూపే ప్రేమను దూరం చేయలేరని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల నుండి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. అందులో భాగంగా బాల్కొండ, ఏర్గట్ల, మెండోరా మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పలు కుల సంఘాల కమిటీ సభ్యులు, రైతులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు అన్ని విధాల అభివృద్ధి చేసి, అండగా నిలిచిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు అని వారు నినదించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... ఓట్లు రాగానే ప్రజలు గుర్తుకువచ్చే కొంతమంది తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారికి బాల్కొండ నియోజకవర్గ ప్రజలే సమాధానం చెప్తారని అన్నారు. ఓట్ల కోసం వారెన్ని రకాల కుయుక్తులు పన్నినా నియోజకవర్గ ప్రజలు తనపై చూపే ప్రేమను దూరం చేయలేరని స్పష్టం చేశారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వం శ్రీరామ రక్ష అయితే బాల్కొండ ప్రజల ఆశీర్వాదమే తనకు శ్రీరామ రక్ష అని తెలిపారు. కాగా గత కొద్ది రోజులుగా అభివృద్ధి వైపే ఉంటామని బాల్కొండ ప్రజానీకం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వేములకు నీరాజనం పలుకుతున్నారు. మంత్రి చేసిన అభివృద్ధి పనులకు ప్రజలు, రైతుల్లో విశేష స్పందన వస్తోంది. మమ్మల్ని నిత్యం కంటికి రెప్పలా కాపాడుకునే నాయకుణ్ణి మేము కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని బాల్కొండ నియోజకవర్గ పల్లెలు ముక్త కంఠంతో నినదిస్తున్నాయి. నియోజకవర్గ నలుమూలల నుంచి తనకు మద్దతు తెలిపేందుకు స్వచ్ఛందంగా తరలివస్తున్న ప్రజలకు, రైతులకు మంత్రి వేముల హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ధర్పల్లి ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌జెడబ్ల్యూహెచ్‌ఆర్‌సి సభ్యులు



ఎస్సైని కలిసిన సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ఛైర్మెన్ డా.కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు సౌత్ ఇండియా వర్కింగ్ కమిటీ ఛైర్మెన్ డా.గంప హనుమగౌడ్, తెలంగాణ రాష్ట్ర ఛైర్మెన్ డా.నోముల సంపత్‌గౌడ్, జిల్లా ఛైర్మన్ సుధాకర్ సూచనల మేరకు ధర్పల్లి ఎస్ఐ వంశీకృష్ణను ఎస్‌జెడబ్ల్యూహెచ్‌ఆర్‌సి నిజామాబాద్ ప్రెసిడెంట్ దత్తు గౌడ్, జిల్లా ఇన్చార్జి సుర్బిర్యాల ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

నారాయణ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని నారాయణ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు బుధవారం నిర్వహించారు. సంబరాల గురించి విద్యార్థులకు ఏజీఎం శివాజి పాటిల్ వివరించి విద్యార్థులతో బతుకమ్మ ఆడించారు. ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణలో రంగుల పూల పండుగ, ఈ ప్రాంతంలోని అన్య దేశపూలతో మహిళలు జరుపుకుంటారని, తెలంగాణ సంస్కృతికి, గుర్తింపుకు ప్రతీకగా ఈ బతుకమ్మ పండుగ ఉందని వివరించారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, డిజీఎం కరుణాకర్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న, అధ్యాపక బృందం, విద్యార్థి విద్యార్థినీలు కలిసి ఘనంగా జరుపుకుని పండుగ వాతావరణాన్ని తలిపించారని అన్నారు.

రైలు కింద దూకి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైలు కిందపడి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే ఎస్సై తావునాయక్ బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మగ వ్యక్తి వయస్సు (30-35) బుధవారం ఉదయం 8:30 గంటలకు జానకంపేట్ రైల్వేస్టేషన్‌కు దగ్గరలో గుర్తు తెలియని కారణాల వలన గుర్తు తెలియని రైలు కింద దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల కోసం 8712658591 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి


మాట్లాడుతున్న ఏపీవో రమణ

నవతెలంగాణ-రెంజల్

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ రమణ క్షేత్ర సహాయకులకు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులను పూర్తి చేయడంతో పాటు రికార్డులను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు మధు, గోపి, యాదగిరి, సాయిలు, దండవుల సాయిలు, శోభన్, అర్జున్, నారాయణ, అర్జున్, హర్షద్ పాషా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాత షెడ్డుకు విరాళాలు అందజేత


విరాళాలు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే దుర్గామాత ఉత్సవాలలో భాగంగా షెడ్డు నిర్మాణానికి సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాన్లు, బిఆర్ఎస్ నాయకులు ఆర్మూర్ శ్రీనివాస్ 30 వేల చొప్పున చొప్పున బుధవారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మగ్గరి హన్మాన్లు మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత షెడ్డు నిర్మాణానికి తన వంతు సాయం చేయడం సంతోషంగా ఉందని దుర్గామాత ఆశీస్సులతో పాడిపంటలతో పాటు ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.

అత్యధిక మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపించాలి


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-దోమకొండ

అధిక మెజార్టీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని ప్రజాప్రతినిధులు కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, సర్పంచ్ జట్టబోయిన నరేష్ కుమార్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాయిని రామ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామ స్వామి, మురళి కరికే, బట్ట సాయిలు, బట్ట రాములు, జోగిని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బెల్ట్‌షాపుల దందా

- ఎన్నికల వేళ.. మద్యం జోరు
- యథేచ్ఛగా సాగుతున్న దుకాణాలు
- తెలిసినా పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల పరిసర ప్రాంత గ్రామాలలో బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతుంది. ఎన్నికల సంఘం ఎన్నికల ఉత్తర్వులు జారీ చేసిన బెల్ట్ షాప్ లో నిర్వాహకులు మాత్రం వారి దందాను యదేచ్ఛగా నడుపుతున్నారు. కొన్ని గ్రామాలలో అయితే ఏకంగా ఏకగ్రీవం చేసి ఒకరే అమ్మాలని తీర్మానాలు కూడా చేశారు. దీంతో ఈ అవకాశాన్ని వాడుకొని వారికి సంబంధించిన రాజకీయ నాయకులతో చేయి కలిపి వారి వారి గ్రామాలలో ఎన్నికలకు సంబంధించిన మద్యాన్ని తమ ద్వారా మీరు చెప్పిన వ్యక్తులకు మద్యం అందిస్తామని బేరసారాలు కొనసాగుతున్నట్టు సమాచారం.

ఎంతో కొంత కమీషన్ ఇవ్వాలని ఒప్పందం చేసుకుంటున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించకపోవడం శోచనీయమని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే బెల్టు షాపులపై దాడులు నిర్వహించటం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నికల సమయం వస్తే బెల్టు షాపులు కానీ కళ్ళు దుకాణాలు కానీ దాబా హెూటల్లు కానీ వారికి ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖ సంబంధిత దాడులు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు బెల్ట్ షాపులు నిర్వాహకులు మాత్రం యథేచ్ఛగా మద్యాన్ని అమ్ముతున్నారు. వారిని ప్రశ్నించగా సంబంధిత అధికారులకు ఏమి ముడుపు చెల్లించాలో అది చెల్లించామని దర్జాగా చెప్పుండటం గమనార్హం.

ఇలా అయితే ఎన్నికల సమయంలో మద్యం ఏరులై పారుతుందని దీనికి అరికట్టాల్సిన శాఖ వారే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తగదని, ఇప్పటికైనా సంబంధిత జిల్లా శాఖ వారు స్పందించి ఈ బెల్ట్ షాపునులను అరికట్టాలని ప్రజలు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

తపాలా శాఖ సహాయ పర్యవేక్షకురాలు సురేఖ బదిలీ

- ఘనంగా వీడ్కోలు కార్యక్రమం


సురేఖకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ తపాల శాఖ పరిధిలోని 8 సబ్ పోస్టాఫీస్‌ల సహాయ పర్యవేక్షకురాలు యాపరు సురేఖ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీ వీడ్కోలు కార్యక్రమం బుధవారం పట్టణంలోని ఎమ్మార్ గార్డెన్‌లో నిర్వహించారు. నూతన సహాయ పర్యవేక్షకుడు భూమన్న అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి సన్మాన గ్రహీతను యాపరు సురేఖ యశ్వంత్‌లను పూలు చల్లుతూ వేదికపైకి ఆహ్వానించారు. ఐపీపీబి సీనియర్ మేనేజర్ మధు మోహన్, లక్ష్మణ్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ముందుగా యాపరు సురేఖ పేరుతో అభినందన నామాక్షరమాల చిత్రపటాన్ని, కరపత్రాలను ఆవిష్కరించారు. 8 పోస్ట్ ఆఫీస్‌ల పరిధిలోని బీపీఎం, ఏబీపీఎంలు సన్మాన గ్రహీతను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తర్వాత యాపరు సురేఖ చేసిన సేవలు పట్టణ ప్రాంతంలో చిరస్మరణీయమని, వారితో ఉన్న అనుబంధాలను, జ్ఞాపకాలను గుర్తుచేసుకొని వారి సేవలను అభినందించారు. మెయిల్ వోవారిస్ చంద్రశేఖర్, దశరథ్‌ను కార్యక్రమ సమన్వయ కర్త జింధం నరహరిలను శాలువా, పూలమాలలతో సత్కరించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తపాల శాఖ ఒక కుటుంబమని, తనకు సహకరించి రాష్ట్ర స్థాయి గుర్తింపుతెచ్చిన ఎస్పీఎంలకు, బీపీఎంలు, ఏబీపీఎంలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎంలు ఆంజనేయులు, ఉదయ్, ప్రదీప్, రాములు, మెయిల్ వోవారీస్‌లు చంద్రశేఖర్, దశరథ్, జీడీఎస్ రాష్ట్ర నాయకులు లింబాగౌడ్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, 8 ఎస్‌వోల బీపీఎంలు వెంకటేష్, రాం మనోహర్, సత్యనారాయణ, వంశీ, మురళీ మనోహరాచారి, అభిరామ్ జగదీశ్, వేణు, రాజేష్, భూషన్ తదితరులు పాల్గొన్నారు.

రజకసంఘం గ్రామ కమిటీ ఎన్నిక


ఎన్నికైన గ్రామ కమిటీ

నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి గ్రామ రజక సంగం సభ్యులు స్థానిక ఐలమ్మ భవన్ నందు సరియగు మంగళవారం రోజున రాత్రి 9 గంటలకు సమావేశమై నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు సంగ్యపు పోల్కంపేట సాయిలు, ప్రధాన కార్యదర్శి సంగెపు ధర్మయ్య, ఉపాధ్యక్షులు బిక్కండ్ల రాజవ్వ, కోశాధికారిగా బండల్ల మల్లేష్‌ను ఏకగ్రీవంగా ఏనుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ ఎస్ఎంసీ చైర్మన్ గుడిసెన రమేష్, కిష్టయ్య, సాయిలు, దుర్గయ్య, రాజయ్య, వార్డ్ సభ్యులు శివయ్య, బుమయ్య, యాదగిరి, బాబు, నారాయణ, పోచయ్య, లస్మయ్య, శారదా, లక్ష్మి, పర్వవ్వ, అశోక్, మరియు మండల ఉపాధ్యక్షులు పోల్కంపేట సాయిబాబా, మండల సమన్వయ కర్త శ్రీ సంగ్యపు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అంగన్వాడీ టీచర్‌తో ఆమె చర్చించారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆమె సూచించారు. ప్రతిరోజు అంగన్వాడి కేంద్రంలోని చిన్నారుల ఎత్తు బరువులను తూచి వారికి గుడ్లు, పాలు అందించాలని ఆమె ఆదేశాలు జారీచేశారు. చిన్నారులకు ఆకుకూరలతో ఆహారాన్ని అందించాలని ఆమె అన్నారు. గర్భిణీ బాలింత మహిళలకు అంగన్వాడి కేంద్రంలోని పౌష్టికాహారాన్ని అందించాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. అనారోగ్యంతో నడవలేని పరిస్థితిలో ఉన్న వారికి మాత్రమే టిఫిన్ బాక్సుల్లో పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సుజాత, ఆయా, గర్భిణీ బాలింత మహిళలు పాల్గొన్నారు.

పశవుల తొట్టిని శుభ్రం


తొట్టిని శుభ్రం చేయిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

ప్రభుత్వ ఆదేశాల అనుసరంగా ప్రజల ఆరోగ్యం కోసం నీటి ట్యాంకుల శుభ్రత అలాగే పశవుల ఆరోగ్యం కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టిల శుభ్రత పంచాయతీ బాధ్యతగా ఎప్పటికప్పుడు నిబంధనల ప్రకారం శుభ్రపరుస్తున్నట్టు మద్నూర్ గ్రామ మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్ కుమార్ తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీనారాయణ ఆలయం పక్కన గల నీటి తొట్టిని బుధవారం నాడు పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. నెలకొక్కసారైనా ఇలా నీటి తొట్టి శుభ్రపరుస్తే పశవులు తాగే నీరు శుభ్రంగా ఉండడం పశవుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామ ప్రజలు పశువులదారులు పంచాయతీ పనితీరుపై సంతోషం వ్యక్తపరుస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-భిక్కనూర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన ఘటన భిక్కనూరు పట్టణంలోని 44వ జాతీయ రహదారి పై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం భిక్కనూర్ పట్టణానికి చెందిన రామగిరి (35) ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లిన రామగిరి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనం పై ఇంటికి వస్తున్న రామగిరిని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మరణించాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించగా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణానికి చెందిన ఫోటో గ్రాఫర్ రామగిరి మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న మండల ఫోటోగ్రాఫర్లు భిక్కనూరు మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామగిరి కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బిక్షపతి, అధ్యక్షులు లింబాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, క్యాషియర్ సమీర్, సలహాదారులు రాజేందర్, రాజ్ కుమార్, బాబు, నవీన్ కుమార్, శ్రీనివాస్ చారి, రాజు, మహమ్మద్ గౌస్, రాజు, రాజేందర్, తదితరులు ఉన్నారు.



ఫిజియోథెరపీతో మేలు



నవతెలంగాణ-పిట్లం

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీతో మేలు కలగనున్నట్టు డాక్టర్ విశాలాక్షి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్న 9మంది వికలాంగులకు ఉచిత ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగుల విద్యార్థులకు క్రమము తప్పకుండా ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించినట్లయితే సక్రమముగా లేని అవయవలు దృఢత్వంతో పాటు పటిష్టత కలిగి ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల చేత వ్యాయామం చేయించారు. ఫిజియోథెరపీతో పాటు వ్యాయామం, ఆసనాలు చేయించాలని ఆమె తల్లిదండ్రులకు సూచిస్తూ, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాడీజమాల్‌పూర్‌లో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండలం జాడిజమాల్‌పూర్ గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, అల్లె రమేష్, అశోక్, మాజీ సర్పంచ్ శీను, దేవదానం, ప్రసాద్, ప్రకాష్, రవి, మోహన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పట్టణంలో నూతన బైకు ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సాయి కిరణ్ బజాజ్ షోరూంలో కొత్త బజాజ్ పల్సర్ ఎన్ 150 వాహనాన్ని ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ మధు శేఖర్ చేతులమీదుగా బుధవారం ఆవిష్కరించారు. బజాజ్ కంపెనీ నుండి విడుదలైన ఈ బైక్ కు భారత దేశం మార్కెట్లో మంచి ఆదరణ ఉందని చెప్పారు. కార్యక్రమంలో చెన్న రవి కుమార్, మల్యాల నర్సారెడ్డి, మందుల బాలు తదితరులు పాల్గొన్నారు.


బైక్‌ను ఆవిష్కరిస్తున్న ఇనిస్ట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్

ప్రభుత్వ భూముల్లో
లే ఔట్లను నిలిపివేయండి

- ఎంపీపీ సంగెం శ్రీనివాస్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలో అసైన్మెంట్ భూములను సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే ఔట్ చేసుకుంటున్నా.. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, ఎంపీఓ రామకృష్ణను ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించగా మండలంలో అసైన్మెంట్ భూములను సైతం లే అవుట్ చేసి సామాన్య ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా అధికారులు ఎందుకు సహకరిస్తున్నారని, ఈ విషయం తన దృష్టికి వచ్చిందని అన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి అటువంటి స్థలాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది సమన్వయంతో పనిచేయకపోవడంతో కూలీలు నష్టపోతున్నారని ఏపీఓ రాజేశ్వర్‌ను వైస్ ఎంపీపీ ఇందూరు హరీష్ నిలదీశారు. గత 17 నెలలుగా గ్రామ పంచాయతీలకు రాష్ట్ర బడ్జెట్ రాకపోవడం కేవలం కేంద్ర బడ్జెట్‌తో ఎలా నిర్వహణ సాగించాలని నాళేశ్వర్ సర్పంచ్ సరిన్ ఎంపీఓ రామకృష్ణను ప్రశ్నించారు. రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు కాకుండా పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ రాధ, ఎమ్మార్వో ధన్వాల్ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, సర్పంచ్ రొడ్డ సుధాకర్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

ఉపాధి హామీ పనుల రికార్డులను పూర్తి చేయాలి

- ఏపీఓ రమణ

నవతెలంగాణ-రెంజల్

ఉపాధి హామీ పనుల రికార్డులను పూర్తి చేయాలని ఏపీఓ రమణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ రమణ అధ్యక్షతన క్షేత్ర సహాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రసహాయకులు ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనుల రికార్డులను ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తి చేయాలన్నారు. గతంలో జరిగిన పనుల వివరాలను ఎలాంటి అవకతవకలు లేకుండా రికార్డులో పొందుపంచాలని ఆయన సూచించారు. పిడి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచుతూ పనులను పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో క్షేత్రసహాయకులు మధు, గోపి, దండవుల శంకర్, హర్షద్ పాషా, యాదగిరి, సాయిలు, రమేష్, శోభన్, శేఖర్, శేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ మరణ

సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండు చెక్కులు పంపిణీ


చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా, అత్యధిక మొత్తంలో సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేస్తున్న ఘనత పియుసి చైర్మన్, బీఆంఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిదేనని ప్రజాప్రతినిధులు అన్నారు. పట్టణంలోని వడ్డెర కాలనీలో నివసించే సుమన్, నవ్యకు, సంతోష్‌నగర్‌కు చెందిన ముజీబ్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలలో చికిత్స కోసం అయిన బిల్లులను ఎమ్మెల్యే నిధుల నుండి సుమన్‌కు 12,000, నవ్యకు 10,000, ముజీబ్‌కు 18,000 మంజూరు చేయించగా, ఆ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందచేశారు. చెక్కులు తీసుకున్న బాధిత కుటుంబ సభ్యులు జీవన్‌రెడ్డికి నిండు మనసుతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ సంగీతా ఖాందేష్ మాట్లాడుతూ ఎవరికీ ఏ ఆపద వచ్చినా మేమున్నాం అని భరోసా ఇస్తూ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేసే మేలు పేద ప్రజలకు కొండంత అండ లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, జాగృతి నియోజకవర్గ కన్వీనర్ మక్కల సాయినాథ్, భాండారి నరేష్, ప్రశాంత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు వంటపాత్రలు అందజేత


పాఠశాలకు వంటపాత్రలను అందజేస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలోని కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలకు బుధవారం ఇందూరు పాఠశాల కరస్పాండెంట్ కిషోర్ పాఠశాల అవసరాల కోసం 20,000 రూపాయలు విలువైన వంట పాత్రలను ఎంఈఓ నాగనాథ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని చదువు కొనసాగించాలని సూచించారు. అనంతరం కొడాలి కిషోర్ మాట్లాడుతూ స్పష్టమైన ప్రణాళికలు ప్రతీ విద్యార్థినులు రూపొందించుకొని భవిష్యత్తులో స్థిరపడటకు ప్రణాళికబద్ధంగా విద్యను కొసాగించాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ మండల నోడల్ అధికారి నాగయ్య, అమ్దాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, కస్తూర్బాగాంధీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో ఫ్రూట్స్, వెజిటేబుల్ దినోత్సవం


ఫ్రూట్స్, వెజిటేబుల్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న ప్రైమరీ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నలంద స్కూల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థులతో ఫ్రూట్స్ వెజిటేబుల్స్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో పిల్లలకు కూరగాయలకు పండ్లకు సంబంధించిన విషయాలు తెలియడంతోపాటు వాటిని తినడం వలన మన శరీరానికి ఏయే పోషకాలు అందుతాయో, వాటి ఉపయోగం, వాటి పేర్లు రంగులు, రుచులు బరువులతో పాటు ఈ పండ్లు కూరగాయల ధరల విషయంలో కూడా వారికి ఈ వయసు నుండే అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే ఎఫ్ఏ 2 పరీక్షలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్, ప్రీస్కూల్ ఉపాధ్యాయినీలు అరుంధతి, శ్రావణి, ఫాతిమా, అర్షియా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బీరువా వితరణ


పాఠశాలకు బీరువాను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మండ లంలోని పిప్రీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అవ సర నిమిత్తం బుధవారం బీరువా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారీ గోపికృష్ణ మాట్లాడుతూ ఆఫీస్ అవసర నిమిత్తం రోటరీ క్లబ్ సభ్యులు మహాలింగం శెట్టి (గీతా భవన్ హెూటల్) వారు ముందుకు వచ్చి స్పందించి స్పాన్సర్‌గా వ్యవహరించారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో నిలవాలని రోటరీ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం స్పాన్సర్‌గా వ్యవహరించిన మహాలింగం శక్తిని పాఠశాల ఉపాధ్యాయ బృందం సభ్యులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ సభ్యులు పుష్పకర్‌రావు, ఖాందేష్ సత్యం, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శివలింగం, శివప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం మోపాల్ మండలాధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

రెడ్డి సంక్షేమ సంఘం మండలాధ్యక్షునిగా సిర్పూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రవీందం రెడ్డి, భూపతిరెడ్డి, కోశాధికారిగా శ్రీకాంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సాయిరెడ్డి, అంగల్ భూమిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిన్న గంగారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో రోజుల నుండి రెడ్డి సంక్షేమ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేకపోయిందన్నారు. చాలా మంది రెడ్డి కులస్తుల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నా రని వారిని ఆదుకోవాలని తెలిపారు. రోజురోజుకు రెడ్డిలపై వివక్షత కూడా పెరిగిపోతుందని, నూటికి 90 మార్కులు వచ్చినా కూడా జాబు వచ్చే పరిస్థితి లేక చదువుతున్న విద్యార్థులు అన్యాయమై పోతున్నారని చెప్పారు. ఇంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి స్కీములు ప్రతి కులం వారికి పెట్టారని కానీ రెడ్డి కులస్తులకు ఎటువంటి పథకాలు లేక ఉండిపోతున్నారని చెప్పారు. కేవలం ఓట్ల సమయాల్లోనే హామీలు ఇస్తున్నారు తప్ప ఎన్నికల్లో గెలిచిన తర్వాత పట్టించుకునే నాథుడే కరువయ్యారని వారు వాపోయారు.



బోధన్ నియోజకవర్గ బ్లాక్-ఏ కాంగ్రెస్ అధ్యక్షులుగా వై.నరేందర్ రెడ్డి


నియామకపత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ - ఏ అధ్యక్షులుగా సాలూర క్యాంప్ గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డిని నియమిస్తూ బుధవారం మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2003లో యూత్ కాంగ్రెస్‌తో మొదలుకొని మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీకి పని చేయడం జరిగిందని తెలిపారు. తనపై నమ్మకంతో తనను బోధన్ నియోజకవర్గ బ్లాక్ - ఏ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ పీసీసీ డెలికెట్ గంగాశంకర్‌కు, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు.


ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కేసీ తండా వాసులు మంత్రి ప్రశాంత్ రెడ్డి కి తమ మద్దతు తెలియజేస్తూ బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో కోట్లాది రూపాయలతో పనులు చేపట్టి, గ్రామాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లిన బీఆంఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికే అండగా ఉంటామని పేర్కొంటూ ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. తండా సభ్యుల అభిప్రాయాల మేరకు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా నిలబడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రశాంత్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ, తమ ఓట్లన్నీ ప్రశాంత్‌రెడ్డికే వేస్తామని పేర్కొన్నారు. తాము చేసుకున్న ఏకగ్రీవ తీర్మానాల ప్రతులను జడ్పీటీసీ రాధా రాజగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ కోనాపూర్ గ్రామంలో మంత్రిగా ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులను గుర్తించి కుల సంఘాల సభ్యులు ప్రశాంత్‌రెడ్డి వెంట ఉంటామని ఏకగ్రీవ తీర్మానాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత కొద్దిరోజుల గ్రామంలో ఏకగ్రీవాల పరంపర కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దయ్య దేవయ్య ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు టేకుల రాజు, ఎస్టి సెల్ మండల అధ్యక్షులు లకావత్ సంతోష్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఉత్కం నర్సాగౌడ్, ఉపసర్పంచ్ టేకుల జలంధర్, పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, జలా రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవ తీర్మానం చేసిన కేసీ తండా వాసులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని


విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని బోయిగల్లీలో గల జెడ్ పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన నక్షత్ర రాష్ట్రస్థా యి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భ ంగా ఎంఈఓ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘువాస్, పిడి గోపిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, వాసుదేవ్, వినోద్, కాశీరాం, దయాకర్ తదితరులున్నారు.

సాంఘిక సంక్షేమ కళాశాలలో సాఫ్ట్‌బాల్ స్లగ్గర్ అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సాంఘిక సంక్షేమ కళాశాల క్రీడా మైదానంలో కొనసాగుతున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల సాఫ్ట్‌బాల్ అకాడమీ క్రీడాకారులు రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ పోటీలలో రాణిస్తున్న సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి 50వేల రూపాయల విలువగల సాఫ్ట్‌బాల్ స్లగ్గర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ దుర్గరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాడమీ క్రీడాకారులు అకాడమీ కోచ్ నరేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పోటీలలో రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరింతమంది క్రీడాకారులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి కృషి చేయాలన్నారు. క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్ నరేష్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, అర్జున్ క్రీడాకారులు పాల్గొన్నారు.


సాఫ్ట్‌బాల్ స్లగ్గర్‌లను అందజేస్తున్న అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి

ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నక్కల నవీన్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన నక్కల నవీన్‌ను జిల్లా ఓబిసి కార్యదర్శిగా బుధవారం నియమించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో ఓబిసి సమావేశంలో భాగంగా రాష్ట్ర ఓబిసి అధ్యక్షులు నైతి శ్రీకాంత్ ఆదేశాల మేరకు జిల్లా ఓబీసీ అధ్యక్షులు డి.రాజా నరేందర్ గౌడ్ చేతుల మీదుగా ఓబిసి జిల్లా కార్యదర్శిగా నక్కల నవీన్‌ను నియమించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓబిసి జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు పొద్దుటూరు వినయ్‌రెడ్డి, ఆర్జివిఎస్ అధ్యక్షులు ఏ.గంగాధర్‌గౌడ్, మాక్లూర్ మండలాధ్యక్షులు రవి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ వేంకటేశ్వరరావు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పీర్ సింగ్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్, కార్యకర్తలు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.


ఓబిసి ప్రధాన కార్యదర్శిగా నవీన్‌కు నియామకపత్రం అందజేత

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు


బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో ఈ నెల 13 నుండి 14 వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్ 13 మేజర్ లీగ్ కప్ 2023 పోటీలకు పట్టణంలోని గురుకుల విద్యార్థులు పాఠశాలకు చెందిన జ్ఞానేశ్వర్, వశీకరణ్, సుశాంత్, విగ్నేష్, కార్తికేయ, లవన్‌కుమార్, సృజన్, అనిరుద్, సాత్విక్, విగ్నేష్, అక్షిత్ ఎంపికయ్యారని, గత ఆగస్టు నెలలో పట్టణంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, బుధవారం విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.దుర్గారెడ్డి అభినందించారు. ఉపాధ్యాయుల వైస్ ప్రిన్సి పాల్ సంధ్యారాణి, శ్రీధర్, గంగాధర్, చిన్నయ్య, లక్ష్మీ ప్రసన్న, వ్యాయామ ఉపాధ్యాయులు కే.రాజేందర్, అర్జున్, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల, కళాశాల బృందం సైతం అభినందించారు.

అర్బన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘానికి చైర్మన్‌గా ఈగ సంజీవరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ అర్బన్ వ్యాయమ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం, పట్టణ ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, నూడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వ్యాయమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మీసాల ప్రశాంత్, కోశాధికారి గంగ మురళి ఆయన నివాసంలో వారికి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీఈటీలందరూ అర్బన్ వ్యాయమ ఉపాధ్యాయ సంఘానికి చైర్మన్‌గా ఈగ సంజీవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఆర్చరీ అసోసియషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లాలో అధ్యక్షునిగా సేవలందిస్తూ ఎంతో మంది క్రీడాకారులకు ప్రోత్సహిస్తానని, భవిష్యత్తులో క్రీడాలకు అన్ని విధాలుగా పెద్దపీట వేస్తామని, జిల్లాలో ఒలింపిక్ భవనం, పేట భవన్ నిర్మిస్తామని అన్నారు. అందరూ కష్టపడి మీ స్కూల్ విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి మంచి పేరు తేవాలని సూచించారు. ఆర్థికంగా అన్ని విధాలుగా ముందుండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెపక్ తక్రా జిల్లా కార్యదర్శి గదారి సంజీవ్‌రెడ్డి, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు గజన్‌లాల్, రేజలింగ్, సీనియర్ క్రీడాకారుడు శ్రీనివాస్, నిఖిల్, శరత్‌రెడ్డి, నాగరాజు, రాము, వినోద్, శ్రీకాంత్, సంతోష్, భాగ్య, సుప్రియ, ప్రియాంక వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పలువురికి సన్మానం